క్లుప్తంగా

గుండిపాలలో ఆర్డీవో పర్యటన



రీసర్వే పనులు పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ

గొలుగొండ: గ్రామాల్లోని రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ఆయన గురువారం గుండిపాల గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ రెవెన్యూ రీసర్వే పనులను పరిశీలించారు. గ్రామ రెవెన్యూ రికార్డుల పరంగా ఉన్న భూములను పరిశీలించి, వాటిని ఆధారంగా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

వడ్డాదిలో 26న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదిలో ఈ నెల 26న జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పద్మలింగేశ్వరస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహా శివరాత్రి, పద్మలింగేశ్వరస్వామి తీర్థం పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 25వ తేదీలోగా రూ.200 చెల్లించి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతులుగా వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు నగదు అందిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 96422 78788, 95534 54467 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

వీరవల్లి అగ్రహారంలో నాగవల్లి సంబరాలు

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారంలో లక్ష్మీనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం నాగవల్లి సంబరాలు, పుష్పాంజలి సేవ నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త దొండా వరహాలు దొర ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు కిశోర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 16న స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని కుమార్ తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలోని ధనిమిశెట్టి వారి కుటుంబాలు గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేరేళ్లపూడిలో ప్రత్యేక వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన, సిబ్బంది

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు నేరేళ్లపూడిలో గురువారం దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్యమేఘన 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎం లక్ష్మీదేవి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.రాజేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో ఆధార్ సేవలు



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

మాడుగుల: స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి గురువారం విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ నారాయణరావు మాట్లాడుతూ తమ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో కొత్తగా ఆధార్ నమోదుతో పాటు, బయోమెట్రిక్, ఫోన్ నంబరు, చిరునామా మార్పులు, పుట్టిన తేదీ, పేరు నమోదులో తప్పులు దొర్లితే సరి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ప్రశాంత్, కేంద్రం ఆపరేటర్ యడ్ల రామలక్ష్మి, మడ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం 'మురుగు' రాజకీయం.!

- పి.జగ్గంపేటలో కాలువను కప్పేసిన టీడీపీ నాయకుడు
- మురుగునీరు ప్రవహించకుండా ఆటంకం
- తీవ్ర దుర్గంధంతో గ్రామస్తుల అవస్థలు



కాలువను మట్టితో కప్పేయడంతో ప్రవహించని నీరు



గ్రామం మధ్యలో నిల్వ ఉన్న మురుగు



మురుగు పారేలా నిర్మించిన కాలువ

నాతవరం: అధికారం చేపట్టినప్పటి నుంచి ఆక్రమణలు, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు తాజాగా కుళ్లు రాజకీయాలకూ దిగుతున్నారు. మురుగునీరు ప్రవహించకుండా కాలువను కప్పేసి ప్రజలను దుర్గంధంలోకి నెట్టేశాడు నాతవరం మండలం పి.జగ్గంపేటకు చెందిన ఓ 'పచ్చ'నేత. మండలంలో పి.జగ్గంపేట గ్రామంలో కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై వైఎస్సార్‌సీపీ హయంలో అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పర్యటనకు వచ్చినప్పుడు సర్పంచ్ జివిరెడ్డి సోమన్నదొర ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే కాలువ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులు చాలకపోవడంతో పంచాయతీ నిధులతో కలిపి ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించారు. పక్కా డ్రైనేజీ నిర్మాణంతో వీధుల్లో ఎక్కడా మురుగునీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు బయటకు సాఫీగా పోతోంది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రజలను ఏళ్లుగా వెంటాడే సమస్యను పరిష్కరించడంతో వైఎస్సార్‌సీపీతో పాటు సర్పంచ్ సోమన్నదొరకు ఆదరణ పెరిగింది. దీన్ని చూసి గ్రామానికి చెందిన టీడీపీ నేత జీర్ణించుకోలేక కక్ష కట్టి డ్రైనేజీని కప్పేశాడు. అధికార పార్టీ నేత కావడంతో కళ్ల ముందే ట్రాక్టరుతో మట్టిని తీసుకొచ్చి కాలువను కప్పేస్తున్నా ఎవ్వరూ ఆపే ప్రయత్నం చేయలేదు. 'మాకు అధికారం ఉంది. గ్రామంలో మేము చెప్పిందే జరుగుతుంది'అంటూ ఆ టీడీపీ నేత వ్యాఖ్యలు చేయడం విశేషం. చేసింది తప్పు అన్న విషయాన్ని మరిచి అధికారం ఉందన్న అహంకారంతో డ్రైనేజీ కప్పిన విషయంపై గ్రామస్తులు ఛీదరించుకుంటున్నారు. డ్రైనేజీలో నీరు ప్రవహించకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్య నిల్వ ఉండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం కాలువ మొత్తం మురుగుతో నిండిపోయింది. డ్రైనేజీ లేక ఇంత కాలం బాధలు పడ్డాం.. కాలువ నిర్మాణం చేశాక తమకు ఈ బాధలు ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. పంచాయతీ అధికారులు సైతం సమస్యను పరిశీలించి ఎలాంటి చర్యలు చేపట్టకుండా మౌనంగా ఉండిపోయారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



కాలువను కప్పేయడంతో మురుగునీరు అక్కడే నిలిచిపోయింది. దుర్గంధం భరించలేకపోతున్నాం. సర్పంచ్, పంచా యతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశాం. కప్పేసిన డ్రైనేజీ తొలగించకుండా అలానే వదిలేశా రు. ఇదెక్కడి రాజకీయాలో అర్థం కావడం లేదు.

– జి.నాగసత్యవతి, జగ్గంపేట గ్రామం

అధికారులు పట్టించుకోలేదు..



కాలువను కప్పేయడంపై స్వయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. అధికారులు ఏమి చెప్పకుండా జాప్యం చేస్తున్నారు. ఇటీవల జరిగిన గ్రామసభలో పంచాయతీ సమావేశంలో ప్రధాన సమస్యగా చర్చించి తీర్మానించాం. సర్పంచ్‌గా ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన బాధ్యత నాదే. గ్రామసభలో తీర్మానించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తా. డ్రైనేజీ నిర్మించిన స్థలం ఆర్ అండ్ బీ శాఖది. ఆర్ అండ్ బీ శాఖ నుంచి డ్రైనేజీ నిర్మాణానికి అనుమతి తీసుకున్నాం.

– జివిరెడ్డి సోమన్నదొర, సర్పంచ్, పి.జగ్గంపేట

మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం

డ్రైనేజీ ప్రవహించకుండా మట్టి వేసిన వ్యక్తితో స్వయంగా మాట్లాడాను. డ్రైనేజీ నీరు రోడ్డు మీదకు వచ్చేస్తుందని, మట్టిని తీసేయాలని చెప్పినా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. గ్రామంలో పెద్దలతో పాటు ఈ విషయాన్ని పంచాయతీ విస్తరణాధికారి దృష్టికి తీసుకెళ్లాను. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిబంధనలు ప్రకారం చేయాలన్నారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

– దేముడుబాబు, పంచాయతీ కార్యదర్శి, పి.జగ్గంపేట పంచాయతీ

వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం అధ్యక్షుడు శివప్రసాద్‌కు సన్మానం



ఏకా శివప్రసాద్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నియమితులైన ఏకా శివ ప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కార్యాలయంలో గురువారం సన్మానించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గణేష్ సూచించారు. పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమరాన శ్రీనివాసరావు, సుర్ల నాయుడు, పాణిశాంతరామ్, యలమంచిలి రఘురామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాతవరం మండల కమిటీ నియామకం



లగుడు నాగేశ్వరరావు

నాతవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాతవరం మండలానికి నూతన కమిటీని నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ మండల అధ్యక్షుడిగా లగుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పైల పోతురాజు, శిరుసుపల్లి శేఖర్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా నలుగురిని, కార్యదర్శులుగా ఐదుగురిని, కార్యనిర్వాహక సభ్యులుగా ముగ్గురిని నియమించారు.

గునుపూడి హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ సాయం



దాత అందించిన కంచాలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాతవరం: మండలంలోని గునుపూడి హైస్కూల్‌కు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పోలుపర్తి శ్రీనివాస్ రూ.40 వేలు విలువ చేసే విద్యుత్ సామగ్రి, కంచాలు సమకూర్చారు. ఈ మేరకు గురువారం విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దల సమక్షంలో హెచ్ఎం శివజ్యోతి విద్యార్థులకు కంచాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైస్కూల్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ నీలం సత్యవతి, వైస్ చైర్మన్ జె.శరభాచారి, గునుపూడి మాజీ సర్పంచ్ సుర్ల స్వామినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింతకాయల శివ, సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, ఎన్ఆర్ఐ శ్రీనివాస్ తరఫున కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : స్థానిక కె.కోటపాడు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ పనులు నిర్వహించనున్న దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కె.కోటపాడులో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తున్న ఎస్ఐ సిహెచ్.భీమరాజు

నాతవరం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. ఆయన గురువారం తాండవ జంక్షన్ నాతవరం ప్రధాన కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు,. రికార్డులు లేకుండా, హెల్మెట్ ధరించకుండా, మితి మీరిన వేగంతో, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వాహనాలు తనిఖీలు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతున్నాయన్నారు.

బర్డ్‌ఫ్లూ ప్రభావం.. పౌల్ట్రీల తనిఖీ



ఎం.కోడూరులో పౌల్ట్రీ యజమానులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి అరుణ్ కిరణ్



కె.జె.పురం పాలగెడ్డ సమీపంలో పౌల్ట్రీ యజమానితో మాట్లాడుతున్న వైద్యాధికారి మణిలక్ష్మణ్

మాడుగుల రూరల్: బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి కారణంగా మండలానికి మూడు ర్యాపిడ్ బాధ్యత బృందాలను ఏర్పాటు చేశామని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు తెలిపారు. ఈ మేరకు ఉభయ గోదావరి జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో చీడికాడ, మాడుగుల మండలాల్లోని కోళ్ల ఫారాలను గత వారం రోజులుగా ఈ ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా ఎం.కోడూరు ప్రభుత్వ పశువైద్యశాల పరిధిలో గురువారం పశు వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కిరణ్ కోళ్ల ఫారాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోళ్ల ఫారం రైతులు బయో సెక్యూరిటీ చర్యలు పాటించాలని, కోళ్ల షెడ్డులు ప్రవేశ మార్గంలో 0.01 పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంను పిచికారీ చేయాలన్నారు. కోళ్ల షెడ్ల పరిసరాల్లో రెండు శాతం సోడియం హైపో క్లోరైట్ లేదా బ్లీచింగ్ పౌడర్, లేదా సున్నం చల్లుకోవాలని చెప్పారు. సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కోళ్లు చనిపోతే సంబంధిత పశు వైద్యాధికారులకు సమాచారం అందించి పూడ్చిపెట్టాలన్నారు.

- కె.జె.పురం పాలగెడ్డ సమీపంలోని కోళ్ల ఫారాలను స్థానిక పశు వైద్యాధికారి మణిలక్ష్మణ్, పశుసంవర్థక సహాయకుడు కోర్రా రమేశ్ పరిశీలించారు. కోళ్ల ఫారం యజమానులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి గురించి ఆందోళన చెందవద్దని, బాగా ఉడికించిన చికెన్, కోడి గుడ్లు తినవచ్చునని తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కె.జె.పురంలో క్యాన్సర్ నివారణపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మాడుగుల రూరల్: కె.జె.పురంలో క్యాన్సర్ నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో కేంద్రం చిన్నారులు, బాలింతలు, గర్భిణులతో కలిసి ఈ ర్యాలీ చేపట్టారు. నోటిలో ఎరుపు లేదా తెలుపు మచ్చ మానకుండా ఉండడం, రెండు వారాలు దాటినా పుండు మానకపోవడం, మింగడం, నోరు తెరవడంలో ఇబ్బంది, రెండు నుంచి మూడు వారాలు స్వర్శలో మార్పు, నోరు, గొంతు, మెడలో గడ్డ ఉండడం, దీనికి తోడు ఒక్కసారిగా బరువు తగ్గితే నోటి క్యాన్సర్‌గా అనుమానించాలన్నారు. పీహెచ్‌సీ, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో తగు చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

137 మందికి ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు



సుగర్ నిర్ధారిత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ అన్నారు. గొట్లాం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు నిర్వహించారు. 137 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. గర్భిణులకు ఏఎన్ఎంలు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలను నిర్వహించుకోవడం తల్లీబిడ్డలకు శ్రేయస్కరమని వైద్యాధికారి సాయికిరణ్ వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ విజయ, హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలపై కేంద్ర బృందం ఆరా



మాకవరపాలెం పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీని గురువారం కేంద్ర బృందం సభ్యులు తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాక్సిన్, ల్యాబ్ గదులతో పాటు ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం శెట్టిపాలెంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం బృందం సభ్యులు డాక్టర్ వరుణ్‌విజయ్, ప్రశాంతి, స్థానిక వైద్యాధికారి శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ఎన్నో అనర్థాలు



మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: మాదక ద్రవ్యాల వాడకం బారిన పడిన వ్యక్తి మృగాల మాదిరిగా ప్రవర్తిస్తాడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల విద్యార్థుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినాన్ని పాటించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయ విక్రయాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ వ్యవహారం పులి మీద స్వారీ వంటిదని, మీద కూర్చుని స్వారీ చేసేటప్పుడు వేడుకగా ఉన్నా, దిగినప్పుడు తెలుస్తుంది ప్రాణానికే ముప్పు అన్న సంగతి అని గుర్తు చేశారు. ఈ విషయంలో విద్యార్థులు ముందుగా మేల్కొని, సమాజాన్ని మేల్కొలపాలన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పలు నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వి.రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, లెక్చరర్లు డాక్టర్ మల్లిబాబు, జి.వెంకటేష్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



కందిపూడిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలోని కందిపూడి గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గ్రామస్తులు ఆంజనేయస్వామిని పూలదండలు, నిమ్మకాయల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. కొండకుమ్మర, కొత్త కందిపూడి, పాత కందిపూడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, నేల డ్యాన్స్‌లు, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేతతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

ముషిడిపల్లిలో దుర్గాలమ్మ పండగ నేడు



దుర్గాలమ్మ అమ్మవారు

దేవరాపల్లి: మండలంలోని ముషిడిపల్లిలో దుర్గాలమ్మ అమ్మవారి ఒడ్డు పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవార జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా వేళల మార్పు

రోలుగుంట: పాయకరేవుపేట–పెద్దాపురం 132 కేవీ లైనులో మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారాల్లో వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా అయ్యే వేళల్లో స్వల్ప మార్పులు ఉంటాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్స్ విడివి రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటల వరకూ , మళ్లీ సాయింత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ త్రి ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని, ఈ మార్పును వినియోగదారులు గమనించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రమణ

మాకవరపాలెం: మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఉన్న పార్టీ నాయకులతో కలసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. కొత్తగా నియామకమైన మండల కమిటీ అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షులు భీమిరెడ్డి గోవింద, పాశపు నాగేశ్వరరావులకు పార్టీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పెట్ల భద్రాచలం, వైస్ ఎంపీపీ రాజారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

చీడికాడ: అర్జునగిరిలో స్వయంభూ శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ప్రధానార్చకుడు పానంగపల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన గుర్రపు పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి.